రైతులకు సాగునీటి కష్టాలు

- ఎండిన శివునిపల్లి పెద్దచెరువు
- రిజర్వాయర్ పక్కనే ఉన్నా అందని దేవాదుల నీరు
- అడుగంటిన భూగర్భ జలాలు.. ఎండుతున్న పంటలు



అడుగంటిన శివునిపల్లి పెద్ద చెరువు



సాగునీరు అందక ఎండిన వరిపొలం

స్టేషన్‌ఘన్‌పూర్: పక్కనే దేవాదుల రిజర్వాయర్ ఉన్నా ఏళ్ల తరబడి శివునిపల్లి రైతులకు సాగునీరు కష్టాలు తప్పడం లేదు. శివునిపల్లి పెద్ద చెరువు ఎండిపోవడంతో వ్యవసాయబావులు, బోర్లలో నీరులేక రైతులు అరిగోస పడుతున్నారు. ఘన్‌పూర్ రిజర్వాయర్ నుంచి శివునిపల్లి చెరువులోకి నీటిని సరఫరా చేసేందుకు చేపట్టిన పనులను అర్ధాంతరంగా వదిలేశారు. ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారుల నిర్లక్ష్యంతో ఏళ్ల తరబడి రైతులకు సాగునీటి కష్టాలు తప్పడం లేదు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని శివునిపల్లి చెరువు కింద దాదాపు 500 ఎకరాల ఆయకట్టు ఉంటుంది. అధిక శాతం రైతులు వరిపంటను పండిస్తారు. చెరువులో నీరు ఉంటే వారి వ్యవసాయ బావులు, బోర్లలో నీరు సమృద్ధిగా ఉంటాయి. పక్కనే ఉన్న ఉన్న విశ్వనాథపురం నుంచి దేవాదుల నీరు పాలకుర్తికి వెళ్తుండగా శివునిపల్లి చెరువులోకి సాగునీరు వచ్చే ఏర్పాట్లు లేవు. దాంతో ప్రతీ వేసవికాలంలో పంటలు సాగుచేయడం, ఎండలతో భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో వేసిన పంటలు ఎండిపోవడం షరామామూలు అవుతోంది. ఈ సీజన్‌లోనైనా సాగునీరు వస్తుందని రైతులు ఆశిస్తే ప్రజాప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యంతో పంటలు ఎండిపోయేదశకు చేరుకున్నాయి.

అసంపూర్తిగా కెనాల్ పనులు

స్టేషన్‌ఘన్‌పూర్ రిజర్వాయర్ నుంచి శివునిపల్లి చెరువులోకి సాగునీరు అందించేందుకు పదేళ్ల క్రితం కెనాల్ తవ్వకం పనులు చేపట్టారు. సంబంధిత అధికారుల నిర్లక్ష్యం, సరైన ప్రణాళిక లేకపోవడంతో కాల్వను నీరు పారకం కన్నా ఎక్కువ ఎత్తుగా నిర్మించారు. దాంతో కాల్వ పనులను అసంపూర్తిగా వదిలేశారు. కాల్వలో తుంగ, పిచ్చిచెట్లు పెరిగి అధ్వానంగా మారింది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాల్వ పనులు మధ్యలోనే వదిలేయగా నిరుపయోగంగా మారింది.

విశ్వనాథపురం మెయిన్ కెనాల్ వద్ద షెటర్ ఏర్పాటు చేయాలి

ఘన్‌పూర్ రిజర్వాయర్ నుంచి పాలకుర్తి వైపు దేవాదుల నీరు వెళ్తున్న విశ్వనాథపురం మెయిన్ కెనాల్ వద్ద షెటర్ ఏర్పాటు చేసి ఫీడర్ ఛానల్ చేస్తే విశ్వనాథపురం చెరువు నిండి అక్కడ నుంచి శివునిపల్లి చెరువులోకి నీళ్లు వస్తాయి. అదేవిధంగా దిగువన ఉన్న నమిలిగొండ, ఉప్పుగల్లు, జఫర్‌గడ్ తదితర గ్రామాలకు సాగునీరు సరఫరా కావడంతో 2వేల ఎకరాలకు పైగా ఆయకట్టుకు నీరు అందుతుంది. అదేవిధంగా శివునిపల్లి చెరువుకట్ట వద్ద తూము ధ్వంసమైనా అధికారులకు పట్టడం లేదు. కట్ట ను మరమ్మతు చేయించి తూము షెటర్ బాగు చేస్తే పాత ఆయకట్టుకు సాగునీరు అందుతుంది. విశ్వనాథపురం మేయిన్ కెనాల్‌వద్ద షెట్టర్ ఏర్పాటు చేస్తే సమస్య పరిష్కారం అవుతుందని, అయితే అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ఈ విషయమై ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రత్యేక చొరవ తీసుకుని సంబంధిత అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి పంటలకు సాగునీరు అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఐదెకరాల పంట ఎండిపోయింది



శివునిపల్లిలో తన వ్యవసాయ భూమిలో ఐదెకరాల్లో వరిపంట సాగుచేశాను. చెరువులో నీరు లేకపోవడంతో బోర్లు పనిచేయడం లేదు. సాగునీరు అందక పంట పూర్తిగా ఎండిపోయింది. పెట్టుబడికి ఇప్పటికే రూ.60వేలు ఖర్చయింది. ఎండిన పంటను చూస్తే ఏడుపు వస్తుంది. పశువులను మేపడం తప్ప చేసేదేమి లేదు.

- తోట రవి, రైతు

దేవాదుల నీరు అందించాలి



ఘన్‌పూర్ రిజర్వాయర్ నుంచి శివునిపల్లి చెరువులోకి నీటిని విడుదల చేయాలి. చెరువు ఎండిపోతుందని పలుమార్లు చెప్పినా సంబంధిత అధికారులకు పట్టడం లేదు. అక్కరకు రాని చోట కెనాల్‌పనులను సగం చేసి అర్థంతరంగా వదిలేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువులోకి దేవాదుల నీటిని అందిస్తే సాగునీటి కష్టాలు తీరుతాయి.

- టి.లక్ష్మీనారాయణ, రైతు

కాంగ్రెస్ నుంచి ఇద్దరి సస్పెన్షన్

కొడకండ్ల: మండలంలోని రామవరం గ్రామానికి చెందిన కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు నక్క సారయ్య, మండల నాయకుడు బొమ్మరబోయిన మహేందర్‌లను కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. గత కొంత కాలంగా వీరిద్దరు పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ పార్టీ క్రమశిక్షణ నియమాలను ఉల్లంగిస్తుండగా.. పద్ధతి మార్చుకోవాలని పలుమార్లు సూచించినా మార్పు రాకపోవడంతో పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి ఆదేశాల మేరకు వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు ఆయన తెలిపారు. వారికి నేటి నుంచి పార్టీతో ఎలాంటి సంబంధం లేదని, త్వరలోనే గ్రామ నూతన కమిటీని ఎన్నుకోనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పెయింటర్ల సంఘం ఎన్నిక



భాస్కర్

పాలకుర్తి: మండల పెయింటర్ల సంఘం అధ్యక్షుడిగా గాదెపాక భాస్కర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పాలకుర్తిలో పెయింటర్స్ మండల కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా గాదెపాక సోమన్న, మండల ఉపాధ్యక్షుడిగా బండిపెల్లి రవి, గౌరవ అధ్యక్షుడిగా మహేందర్, ప్రచార కార్యదర్శిగా పాలడుగు ప్రశాంత్, కోశాధికారిగా గ్యార సురేష్ తదితరులు ఎన్నికయ్యారు. సీనియర్ నాయకులు అజయ్, తూటి పరశరాములు, ఇరుగు అశోక్, గాదెపాక మల్లేశ్, ఎడవల్లి కుమార్, మండల పెయింటర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు 'వేద'లో స్వర్ణ ప్రాసన శిబిరం

జనగామ: జిల్లా కేంద్రం హైదరాబాద్ రోడ్డు ఏకశిలా బీఈడీ కళాశాల ఎదురుగా ఉన్న వేద ఆయుర్వేదిక్ పంచకర్మ, వెల్‌నెస్ సెంటర్ (ఆస్పత్రి)లో పుష్యమి నక్షత్రం పురస్కరించుకుని నేడు(మంగళవారం) ఉచిత స్వర్ణ ప్రాసన శిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ అంజిరెడ్డి తెలిపారు. సోమవారం ఇక్కడ ఆయన మాట్లాడుతూ ఉదయం 7 నుంచి 8 గంటల వరకు 0 నుంచి 16 ఏళ్ల లోపు పిల్లలకు స్వర్ణ ప్రాసన నిర్వహించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాల కోసం 9000 097686, 87902 24849 నంబర్లను సంప్రదించాలన్నారు. స్వర్ణ ప్రాసనతో పిల్లల్లో మేధోశక్తి పెంపొందడమే కాకుండా ఎముకల పటిష్టత, జీర్ణ శక్తి ప్రక్రియ మెరుగ్గా పని చేసేందుకు దోహదపడుతుందని తెలిపారు.

నేడు ఛాగల్లులో 'రైతు నేస్తం'

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఛాగల్లు గ్రామంలోని రైతువేదికలో మంగళవారం రైతు నేస్తం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి చంద్రన్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 11.30 గంటల వరకు కార్యక్రమం ఉంటుందని, వరిసాగులో ప్రస్తుతం పాటించాల్సిన మెళవకువలు, ఆయిల్‌పామ్ సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కూరగాయల సాగు, వాటిపై వాడే పురుగుల మందుల అవశేషాల గురించి వ్యవసాయ శాస్త్రవేత్తలు తగిన సలహాలు, సూచనలు అందిస్తారన్నారు.

పశువుల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

నర్మెట: పశువుల ఆరోగ్యంపై రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల పశువైద్యాధికారి స్నేహ అన్నారు. సోమవారం మండలంలోని వెల్దండ గ్రామంలో పశువులకు టీకా క్యాంపును ఆమె ప్రారంభించి మాట్లాడారు. పశువులకు ఎఫ్ఎండీ, లంపీ స్కిన్ వ్యాధులు సోకకుండా టీకాలను తప్పనిసరిగా వేయించాలన్నారు. జేవీఓ సుభద్ర, శివనాగరాజు, వెంకటేష్, పవన్, రాజు, రైతులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పశువైద్యశిబిరం..

బచ్చన్నపేట: మండలంలోని పడమటికేశ్వాపూర్, కేసిరెడ్డిపల్లి గ్రామాల్లో చేపట్టిన పశువైద్య శిబిరం కొనసాగుతోంది. సోమవారం పశువైద్యాధికారి గుర్రం రామారావు మాట్లాడుతూ పశువులకు ఎఫ్ఎండీ, లంపీ స్కిన్ వ్యాధులు రాకుండా టీకాలను తప్పనిసరిగా వేయించాలని సూచించారు. వీఏ ఆస్మా, న జీర్, కనకరాజు, మల్లేశం,గోపాలమిత్ర రాజు రైతులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి



పాలకుర్తి టౌన్: ఓటు హక్కు లేని వారు ఓటరుగా నమోదు చేసుకోవాలని సాంస్కృతిక సమాఖ్య కళాకారులు కోరారు. పాలకుర్తిలో ఓటరు నమోదు, ఓటుహక్కు ప్రాముఖ్యతపై సోమవారం కళాకారులు వివరించారు. జనగామ శంకర్, గట్టు గుళ్ల సంజీవ, బానోత్ గణేష్, పిన్నింటి రత్నం, కారుపోతుల సోమన్న, పన్నీరు శ్రీనివాస్, కేకే రాజు, అనపర్తి సప్న, బెజ్జిరి చంద్రశేఖర్, రంజాన్, సల్ల మమత పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి యువకుడి మృతి



ప్రవీణ్‌కుమార్ (ఫైల్)

కొడకండ్ల: మండలంలోని లక్ష్మక్కపల్లి గ్రామానికి చెందిన వరికుప్పల ప్రవీణ్‌కుమార్ (25) సోమవారం చేపల వేటకు వెళ్లి చెరువులో మునిగి మృతి చెందాడు. ఎస్సై బండి శ్రావణ్‌కుమార్ కథనం ప్రకారం.. గ్రామ శివారులోని నల్లకుంట చెరువులో వరికుప్పల సమ్మయ్య, చిరంజీవిలతో కలిసి ప్రవీణ్‌కుమార్ చేపల వేటకు వెళ్లి వల వేసే క్రమంలో చెరువులో మునిగి మృతి చెందాడు. మృతుడి తల్లి సైదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పంచనామా నిర్వహించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

వీధి కుక్కల దాడిలో గొర్రెలు మృతి



జఫర్‌గఢ్: వీధి కుక్కల దాడిలో 8 గొర్రెలు మృతి చెందగా మరో రెండు గొర్రెలు తీవ్రంగా గాయపడిన సంఘటన తమ్మడపల్లి (జి)లో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గొర్రెలు, మేకల పెంపకందారుడు వేల్పుల రాజు రోజు మాదిరిగా ఆదివారం కొట్టంలో గొర్రెలను తోలాడు. అర్ధరాత్రి వీధి కుక్కలు కొట్టంలోకి చొరబడి గొర్రెల మందపై దాడి చేయడంతో 8 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందగా రెండు గొర్రెలకు తీవ్ర గాయాలయ్యాయి. గొర్రెల మృతితో రూ.50 వేలు నష్టపోయినట్లు రాజు తెలిపాడు. బాధితుడికి ప్రభుత్వ పరంగా పరిహారం అందించి ఆదుకోవాలని పలువురు కోరారు.

శ్రీరామనవమి ఉత్సవాలకు ఏర్పాట్లు



పాలకుర్తి: ఏర్పాట్లపై మాట్లాడుతున్న ఝాన్సీరెడ్డి

పాలకుర్తి: పాలకుర్తి మండలం వల్మిడి సీతారామ చంద్రస్వామి ఆలయంలో శ్రీరామనవమి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయనున్నట్లు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీ రాజేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆలయంలో స్వామి వారిని ఆమె దర్శించుకొని ఏర్పాట్లపై ఆలయ కమిటీతో చర్చించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గుగ్గిళ్ల ఆదినాయణ, కొడకండ్ల మార్కెట్ మాజీ చైర్మన్ ఎర్రబెల్లి రాఘవరావు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు జలగం కుమార్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మాదాసు హరిష్, గాదెపాక భాస్కర్, లావుడ్య భాస్కర్, కారుపోతుల శ్రీనివాస్, నీరటి చంద్రయ్య, పోగు శ్రీనివాస్, ఐలేష్ యాదవ్, కత్తుల నరేష్ పాల్గొన్నారు.

కల్యాణ మహోత్సవానికి ఆహ్వానం

దేవరుప్పుల: కడవెండిలోని వానకొండ లక్ష్మీనర్సింహస్వామి కల్యాణ మహోత్సవాన్ని ఈ నెల 25న నిర్వహిస్తున్నందున.. హాజరు కావాలని కాంగ్రెస్ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డిని ఆలయ కమిటీ బాధ్యులు సోమవారం ఆహ్వానించారు. కనులపండువగా నిర్వహించే కల్యాణ మహోత్సవానికి తప్పక హాజరు కావాలని వారు ఆమెను కోరారు. ఆలయ ప్రధాన అర్చకుడు బీటుకూరి సంపత్‌కుమారచార్యులు, ఆలయ కమిటీ అధ్యక్షుడు పెద్ద రమేష్‌గౌడ్, ఉపాధ్యక్షుడు మల్లయ్య పాల్గొన్నారు.

గెలుపోటములు సహజం



చిల్పూరు: క్రీడల్లో గెలుపోటములు సహజమని బహుమతుల దాతలు ఎడవెల్లి దిలీప్‌రెడ్డి, పోలేపల్లి రంజిత్‌రెడ్డి అన్నారు. మండలంలోని మల్కాపూర్‌లో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో ఫైనల్‌లో విన్నర్‌గా నిలిచిన స్టేషన్‌ఘన్‌పూర్ జట్టుకు, రన్నర్‌ప్‌గా నిలిచిన మల్కాపూర్ జట్టుకు సోమవారం బహుమతులను అందజేశారు. ద్వితీయ బహుమతులను పశుల వెంకటేష్, ఊరడి సతీష్, బోగం రాజేందర్ ఇచ్చారు. కార్యక్రమంలో రాజేందర్, మేకల వినయ్, చింతల శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీజేపీ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయం

జఫర్‌గఢ్: కేంద్రంలో నరేంద్రమోదీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం మూడో సారి మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కోరుకొప్పుల నాగేష్‌గౌడ్, పార్టీ జిల్లా నాయకుడు ఎండీ వలిపాషా అన్నారు. మండల కేంద్రంలో పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. మోదీ చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలే మళ్లీ బీజేపీని అధికారంలోకి తీసుకవస్తాయన్నారు. అనంతరం కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడిగా అబ్బరబోయిన యాకస్వామి, దళిత మోర్చా మండల అధ్యక్షుడిగా గాదెపాక శ్రీనివాస్ ఎస్టీ మోర్చా మండల అధ్యక్షుడిగా భూక్య శివనాయక్‌ను నియమించినట్లు పార్టీ మండల అధ్యక్షుడు నాగేష్‌గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు బుర్ర తిరుపతిగౌడ్, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు తాటి సురేష్‌గౌడ్, ఎస్ రమేష్, పందిబోయిన రాజు, సాయిరాం పాల్గొన్నారు.

'పది' పరీక్షలు ప్రారంభం



పాలకుర్తి: పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

రఘునాథపల్లి/బచ్చన్నపేట/పాలకుర్తిటౌన్/ చిల్పూరు: జిల్లాలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. విద్యార్థులు హాజరై పరీక్షలను ప్రశాంతంగా రాశారు. కాగా, పలు పరీక్ష కేంద్రాలను పోలీసు, నోడల్ అధికారులు సందర్శించి పర్యవేక్షించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉందని, సమీపంలోని జిరాక్స్ సెంటర్లు ఓపెన్ చేయొద్దని సూచించారు.



బచ్చన్నపేట పరీక్ష కేంద్రం వద్ద..



రఘునాథపల్లి సెంటర్ వద్ద పర్యవేక్షిస్తున్న సీఐ శ్రీనివాస్‌యాదవ్, ఎస్సై నరేష్

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



ఉపాధి పనుల వద్ద ప్రతిజ్ఞ చేయిస్తున్న లావణ్య



పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న టీచర్

రఘునాథపల్లి: చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య అన్నారు. మండలంలోని లక్ష్మీతండా శివారులో కొనసాగుతున్న ఉపాధి పనుల వద్ద సోమవారం పోషణ పక్షోత్సవాలు నిర్వహించారు. ఉపాధి పనులు ముగిశాక స్థానిక అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో మహిళా కూలీలు, గర్భిణులు, బాలింతలకు చిరు ధాన్యాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడారు. అనంతరం మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. అదే విధంగా లక్ష్మీతండా శివారు రామచంద్రగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షోత్సవాలు నిర్వహించారు. పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని లావణ్య సూచించారు. అయా కార్యక్రమాల్లో పంచాయతీ కార్యదర్శి సంధ్య, హెచ్ఎం శ్రీహరి, అంగన్‌వాడీ టీచర్లు మంజుల, ప్రేమలత, ఆయాలు భాగ్య, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

తరిగొప్పుల: మండలంలోని బోజ్యాతండా, రుప్లాతండా అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకు కూరలు, కూరగాయలు, చిరుధాన్యాలపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు బుజ్జి, స్వరూప మాట్లాడుతూ ఐఎఫ్ఏ మాత్రలు ఖచ్చితమైన సమయంలో తీసుకోవడంతో పోషకలోపానికి గురికాకుండా తల్లిబిడ్డ క్షేమంగా, ఆరోగ్యంగా ఉంటారని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రత్న, ఆయా స్వరూప పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు, పొక్లెయినర్ సీజ్

లింగాలఘణపురం: మండలంలోని గుమ్మడవెల్లిలో సోమవారం కెనాల్ మట్టిని అక్రమంగా తరలిస్తుండగా ఐదు ఇసుక ట్రాక్టర్లు ఒక పొక్లెయినర్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై చింత రాజు తెలిపారు. మండలంలో మట్టి, ఇసుకను అక్రమ తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

ఖిలాషాపూర్ శివారులో..

రఘునాథపల్లి: మండలంలోని ఖిలాషాపూర్ శివారులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై దూదిమెట్ల నరేష్ సోమవారం తెలిపారు. గ్రామానికి చెందిన ట్రాక్టర్ యజమాని రంగు సంతోష్ ఎలాంటి అనుమతులు లేకుండా కాయితాల వేణుమాధవ్, పరమేష్ అనే కార్మికులతో కలిసి పటేల్ చెరువు వాగు నుంచి ట్రాక్టర్‌లో ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా వాహనాన్ని స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించి ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించబోమన్నారు.

సన్మానం

జనగామ రూరల్/దేవరుప్పుల: తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటీవ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన మాజీ జిల్లా అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డిని సోమవారం ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు అభిగౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. రాజేంద్ర నాయక్, కార్తీక్, పవన్, రాజు, ధీరజ్ ఉన్నారు. అలాగే దేవరుప్పుల మండలం నల్లకుంట తండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు భాస్కర్‌నాయక్, మహేందర్‌లు జంగాను కలిసి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు.

సమస్యలు పరిష్కరించాలి

జనగామ రూరల్: పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఎన్ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అభిగౌడ్ జనగామ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లును కోరారు. కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్వర్లును ఆయన సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే అందజేశారు. పట్టణ అధ్యక్షుడు కార్తీక్, లింగాల ఘణపురం మండల అధ్యక్షుడు ధీరజ్ ఉన్నారు.

నియామకం

జఫర్‌గఢ్: మండల కేంద్రానికి చెందిన సింగారపు రమేష్ బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరు పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి, మండల అధ్యక్షుడు కోరుకొప్పుల నాగేష్‌గౌడ్‌లు రమేష్‌కు నియామక పత్రాన్ని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ తన సేవలను గుర్తించి పార్టీ మండల ప్రధాన కార్యదర్శిగా నియమించినందుకు జిల్లా అధ్యక్షుడు, పార్టీ జిల్లా, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

అభినందనీయం

చిల్పూరు: పదోతరగతి విద్యార్థులు పరీక్షలకు వెళ్లేందుకు ఎంపీటీసీ పాశం శిరీషసురేష్ వాహన సౌకర్యం ఏర్పాటు చేయడం అభినందనీయమని హెచ్ఎం శ్రీదేవి అన్నారు. మండలంలోని నష్కల్ నుంచి మల్కాపూర్ ఉన్నత పాఠశాల సెంటర్‌లో నిర్వహించే పదోతరగతి పరీక్షలకు వెళ్లే 12 మంది విద్యార్థుల కోసం ఎంపీటీసీ సొంత ఖర్చులతో సోమవారం వాహన సౌకర్యం ఏర్పాటు చేయడంతో వారు ఆనందం వ్యక్తం చేశారని తెలిపారు. పరీక్షలు ముగిసే వరకు వాహన సౌకర్యం కల్పిస్తామని ఎంపీటీసీ ఈ సందర్భంగా చెప్పారు. ఉపాధ్యాయులు రాంమోహన్, శ్రీనివాస్, జ్యోతిలక్ష్మి, సమత, అరుణాదేవి, అరుణల,శాగంటి మణి పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

చిల్పూరు: నెల 16 నుంచి 24 వరకు నిర్వహిస్తున్న బుగులు వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని సోమవారం ఆలయ శాశ్వత అభివృద్ధి దాత, మాజీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు-కిరణ్మయి దంపతులకు ఉత్సవ కమిటీ చైర్మన్ మామిడాల యాదవరెడ్డి ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో ధర్మకర్తలు సంగోజు మోహనాచారి, గాజుల రజని, పుట్ట కిరణ్‌రెడ్డి, నారాయణ, జక్కుల రాజశేఖర్, మధు, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఫ్లెక్సీల తొలగింపు

బచ్చన్నపేట: ఎంపీ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందున మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో ఎన్నికల అధికారి సూచనల మేరకు సోమవారం ఫ్లెక్సీలు, వాల్‌రైటింగ్‌లను జీపీ సిబ్బంది తొలగించారు. అలాగే పార్టీ గద్దెలకు కవర్లను కప్పారు. అనుమతులు లేకుండా ఎలాంటి వాల్‌రైటింగ్, ఫ్లెక్సీలను ఏర్పాటు చేయొద్దని ఎన్నికల అధికారి, ఎంపీడీఓ రఘురామకృష్ణ అన్నారు.

ఘనంగా స్వయంపాలన

జఫర్‌గఢ్/దేవరుప్పుల: జఫర్‌గఢ్‌లోని గీతాంజలి ఇంగ్లిష్ మీడియం, దేవరుప్పుల మండలంలోని బీఆర్‌తండా ప్రాథమిక పాఠశాలల్లో సోమవారం స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా విద్యాబోధన చేశారు. హెచ్ఎంలు నర్సింగం గౌడ్, తాటి జ్యోతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పల్లగుట్టలో హోమం

చిల్పూరు: పల్లగుట్ట గ్రామంలో ఈనెల 20వ తేదీన నిర్వహించే మల్లిఖార్జునస్వామి కల్యాణం సందర్భంగా సోమవారం గొడుగు రామరాజు-రమ్య దంపతులతో పాటు కుటుంబ సభ్యులు మనోహర్, కార్తీక్, అర్పితల ఆధ్వర్యంలో అర్చకులు అంజనేయశర్మ, కిశోర్‌శర్మల వేద మంత్రాల నడుమ హోమం నిర్వహించారు.

హైమాస్ట్ లైట్ల ఏర్పాటు

బచ్చన్నపేట: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల హాస్టల్ ఎదుట హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేసినట్లు పంచాయతీ కార్యదర్శి అనిల్‌రాజ్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గత కొంత కాలంగా లైట్లు పనిచేయక రాత్రి వేళల్లో విద్యార్థులు పడుతున్న ఇబ్బందిని గుర్తించి హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేశామన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

బచ్చన్నపేట: మండలంలోని 172 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేసినట్లు తహసీల్దార్ విశాలాక్షి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో ఏర్పాటు చేసిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. లబ్ధిదారులు చెక్కులను నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేసుకోవాలన్నారు. అందుబాటులో లేని వారు తర్వాత రెవెన్యూ కార్యాలయానికి వచ్చి వారి చెక్కులను తీసుకోవచ్చునని తెలిపారు. ఎంఆర్ఐ శ్రీనివాస్‌రావు, జూనియర్ అసిస్టెంట్ సుమన్, యాకయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఘన్‌పూర్ పాస్టర్ల కమిటీ ఎన్నిక

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ మండల పాస్టర్ల కమిటీని డివిజన్ కేంద్రంలోని కల్వరి పవర్ మినిస్ట్రీస్ మందిర ఆవరణలో సోమవారం ఎన్నుకున్నారు. పాస్టర్ కందిక అశోక్‌పాల్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ట్రూ క్రిస్టియన్ పాస్టర్ ఫెలోషిప్ పేరిట నూతన కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ అధ్యక్షుడిగా పాస్టర్ మునిగాల భాస్కర్, ఉపాధ్యక్షుడుగా చుక్క ఏలియా, సెక్రటరీ ఇల్లందుల చైతన్యసాదు, జాయింట్‌సెక్రటరీగా గాదెపాక రమేష్‌పాల్, అడ్వయిజరీ బోర్డు సభ్యులుగా విజయ్‌కుమార్, ప్రభుచరణ్, అబ్రహం, ఎగ్జిక్యూటివ్ బోర్డు సభ్యులుగా ప్రశాంత్, సుభాష్, లక్ష్మణ్, ట్రెజరీ బోర్డు సభ్యులుగా అవరోన్, రఘువీర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు భాస్కర్ మాట్లాడుతూ పాస్టర్ల మండల అధ్యక్షుడిగా ఎన్నిక కావడం సంతోషంగా ఉందని, పాస్టర్ల సమస్యల పరిష్కారానికి శాయశక్తులా కృషి చేస్తానన్నారు. తన ఎన్నికకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

తిరుమలనాథస్వామికి పూజలు

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలోని తిరుమలనాథ స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కేసు నమోదు

నర్మెట: బాలికను అదే గ్రామానికి చెందిన ముగ్గురు మైనర్లు మూడు నెలలుగా లైంగికంగా వేధించిన సంఘటన మండలంలోని అమ్మాపురం గ్రామంలో జరిగింది. సోమవారం ఎస్సై కన్నెబోయిన శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మైనర్ బాలికను అదే గ్రామానికి చెందిన ముగ్గురు బాలురు మూడు నెలలుగా లైంగికంగా వేధింపులకు గురిచేశారు. ఈ విషయమై గ్రామంలో పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీకి కూర్చోగా వారు ఇరువురు మధ్య సయోధ్య కుదరక పోవడంతో అమ్మాయి తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని అన్నారు. వారి ఫిర్యాదు మేరకు విచారణ చేసి ముగ్గురు అబ్బాయిలను జువైనల్ కోర్టుకు, అమ్మాయిని షెల్టర్ హోమ్‌కు తరలించామన్నారు.

చౌడూరులో పోలీసు జాగృతి కళాప్రదర్శన

దేవరుప్పుల: మండలంలోని చౌడూర్ గ్రామంలో సోమవారం రాత్రి పోలీసు జాగృతి కళాకారులు సమాజ రుగ్మతలపై అవగాహన, కళాప్రదర్శనలు చేపట్టారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ఆటపాట ద్వారా అవగాహన కల్పించారు.

సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలి



ఎండిన మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న నాయకులు

జఫర్‌గఢ్: నీరందక ఎండిపోతున్న పంటలకు దేవాదుల రిజర్వాయర్ ద్వారా సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాపర్తి సోమయ్య డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో మండల పరిధి సూరారం, తీగారం గ్రామాల్లో ఎండిన పంట పొలాలను నాయకులు, రైతులతో కలసి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువు ఆయకట్టు పరిధి, వ్యవసాయ బోరుబావుల కింద సాగు చేసిన పంట పొలాలు నీరందక ఎండిపోతున్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సాగునీరు అందించడంతో పాటు ఎండిపోయిన పంటలకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. నీరటి కొమురయ్య, ఎర్ర రవి, వెన్నపూస నాంపల్లి, సముద్రాల రాజన్న, నర్సింగోజు రాజు, మాడరాజు యాదగిరి, సముద్రాల రంజిత్, సంపత్ ఉన్నారు.

భగవద్గీత ప్రచారం

లింగాలఘణపురం: మండలంలోని నాగారం, మంథోనిగూడెం గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక జనగామ, చేర్యాల, భువనగిరి, తొర్రూరు కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ప్రచారం చేశారు. కార్యక్రమంలో దేవేందర్, రామరాజు, సాయిరాజ్, అశోక్, ఉపేందర్, లింగస్వామి, శంకర్, లక్ష్మీనారాయణ, రాము, లత, కవిత, జయమ్మ, రాణి పాల్గొన్నారు.